## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్, జూన్ 19 : నేడు శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ షేక్‌భాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ ఫీడర్ పరిధిలో వార్షిక మెంటెనెన్స్‌లో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్వాల్‌గూడ, మర్లగూడ, ఔటర్‌సర్వీస్‌రోడ్డు, ఆర్‌కే గార్డెన్,చెన్నమ్మ హోటల్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నర్కూడ, కవ్వగూడ, అమ్మపల్లి ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. ఆయా ఏరియా ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

## 30న రాష్ట్రస్థాయి కవులు, కళాకారుల సదస్సు

హిమాయత్ నగర్, జూన్19: రాష్ట్రంలో సమగ్ర సాంస్కృతిక విధానం ప్రకటించాలని కోరుతూ ఈ నెల 30న హిమాయత్‌నగర్‌లో రాష్ట్రస్థాయి కవులు, కళాకారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ తెలిపారు. గురువారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో కళాకారులకు కోటా కల్పించి, సముచిత స్థానం కల్పించాలని కోరారు. కవులు, కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, ఉద్యమ కళాకారులకు సారధిలో ఉద్యోగాలు, పిల్లల చదువులకు, ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలన్నారు. ఈ సదస్సులో పలు అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.ఈ సదస్సుకు కవులు, కళాకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లక్ష్మీ నారాయణ, రవి, సహాయ కార్యదర్శి కె.ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించకుంటే.. రెవెన్యూ సదస్సులు ఎందుకు

### రెవెన్యూ సదస్సుల్లో మల్కారం గ్రామ రైతులు

శంషాబాద్ రూరల్, జూన్ 19 : రైతుల భూసమస్యలు పరిష్కరించనప్పుడు రెవెన్యూ సదస్సులు ఎందుకని మల్కారం గ్రామ రైతులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. గురువారం శంషాబాద్ మండలలోని మల్కారంలో డిప్యూటీ తహసీల్దార్ వేణు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన దాదాపు 60 నుంచి 70 మంది రైతులకు 1986లో మల్కారం గ్రామ రెవెన్యూ పరిధిలోని 84,88 సర్వే నంబర్లలోని అసైండ్ భూముల పట్టాలు ఇచ్చారు. కాని మాకు పట్టాదారు పాస్‌బుక్కులు ఇవ్వాలని కోరుతూ అధికారులను పలువురు రైతులు కోరారు. కనీసం తమ దరఖాస్తులు తీసుకోవాలని కోరగా తాము దరఖాస్తులు తీసుకోలేమని తేల్చి చెప్పారు. దీంతో ఆ గ్రామ రైతులు భూ సమస్యలు పరిష్కారం కానప్పుడు ఎందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారని నిలదీశారు. దీంతో పాటు రెవెన్యూ అధికారులు పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వేణును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేవలం ఒక రైతుకు సంబంధించిన వివరాలు మరో రైతు ఖాతాల్లో ఉన్న వాటిని పరిష్కారం చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దీంతో పాటు డిజిటల్ కీ,మ్యూటేషన్, విరాసత్ లాంటి వాటికి మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఐ సారికతో పాటు పలువురు సిబ్బంది, గ్రామ రైతులు యాదగిరిరెడ్డి,నవీన్‌రెడ్డి, ప్రసాద్,శ్రీనివాస్‌లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



మల్కారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాస్‌బుక్కులు ఇవ్వాలని కోరుతున్న గ్రామ రైతులు

దీంతో పాటు కోత్వాల్‌గూడ గ్రామంలో జరిగిన సదస్సులో తహసీల్దార్ రవీందర్ దత్ పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన్నట్లు తెలిపారు. ఎన్వీ భూములకు సంబంధించిన విషయం కోర్టులో ఉండడంతో ఆ భూములకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించలేదని వివరించారు.



### పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

పాదచారుల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన పుట్‌పాత్‌లను ఆక్రమిస్తే వాటిని ఉపేక్షించమని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ నుంచి కాటేదాన్, ఓల్డ్ కర్నూల్ రోడ్డు పుట్‌పాత్‌లను ఆక్రమించి షెడ్లు వేసిన వాటిని గురువారం ఉప కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ కూల్చివేతలను చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో రోడ్డుకు ఇరువైపులా పుట్‌పాత్‌లపై వెలిసిన షెడ్లను నేలమట్టం చేశారు. మరోసారి షెడ్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. – మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 19:

## అనంతరెడ్డి దౌర్జన్యాలు అరికట్టాలి


చిన్నగోల్కొండ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు బాల్‌రాజ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 19 : చిన్నగోల్కొండలో అనంతరెడ్డి దౌర్జన్యాలు అరికట్టాలని చిన్నగోల్కొండ గ్రామస్తులు బాల్‌రాజ్, గౌతంబాబు,యాదయ్యలు కోరారు. గురువారం మండలంలోని చిన్నగోల్కొండ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ చిన్నగోల్కొండ గ్రామ మాజీ సర్పంచ్ భర్త, సహకార సంఘం డైరక్టర్ గుర్రం అనంతరెడ్డి దౌర్జన్యాలను ఆగడాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదేళ్లుగా గుర్రం అనంతరెడి అతడి భార్య సర్పంచ్‌గా ఉండడంతో పాటు అతడి ఆగడాలు శృతిమించిపోయి దళిత రైతులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దళిత రైతులకు చెందిన దాదాపు 250 ఎకరాల అసైండ్ భూములను తక్కువ ధరలకు అగ్రిమెంట్లు చేసుకొని వారికి పూర్తిగా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. డబ్బులు ఇవ్వాలని ప్రశ్నిసే అతడి అనుచరులతో దాడులు చేయిస్తున్నారని తెలిపారు. భూముల్లో ఇంటి నంబర్లు ఇచ్చి కోర్టుల ద్వారా రెవెన్యూ అధికారులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. సమావేశంలో గ్రామస్తులు నర్సింహ,సురేష్, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

## ఇదేనా స్వచ్ఛ సర్వేక్షణ్ స్ఫూర్తి

### చెత్త తరలింపులో బల్దియా నిర్లక్ష్యం -ఆగ్రహం వ్యక్తం చేసిన కార్పొరేటర్


జూబ్లీహిల్స్ డివిజన్ గౌతమ్‌నగర్ చౌరస్తాలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

బంజారాహిల్స్,జూన్ 19: హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అగ్రభాగంలో నిలిపేలా పనిచేయాలంటూ అధికారులు ప్రకటనలు జారీ చేస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం శానిటేషన్ విభాగం సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆరోపించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని పలు బస్తీల్లో చెత్త తరలింపులో జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఫిర్యాదులు అందుకున్న కార్పొరేటర్ గురువారం పర్యటించారు. పలు ప్రాంతాల్లో రోడ్లపక్కన భారీగా చెత్తకుప్పలు కనిపించడంతో తీవ్రంగా స్పందించిన కార్పొరేటర్ వెంకటేష్ జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛతలో మంచి ర్యాంకు పొందాలంటూ జీహెచ్ఎంసీ అధికారులు ఒకవైపు ప్రత్యేకంగా కార్యక్రమాలు చేస్తుంటే రోజువారీ చెత్తను తొలగించడంలో ఇంత నిర్లక్ష్యం ఏంటని ప్రశ్నించారు.
పక్కనున్న షేక్‌పేట డివిజన్‌లో ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తుంటే జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్‌లో మాత్రం పరిస్థితి దారుణంగా తయారైందని అసంతృప్తి వ్యక్తం చేశారు.



### అంగన్‌వాడీ కేంద్రంలో.. అక్షరాభ్యాసం

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సంప్రదాయ పద్ధతిలో అక్షరాభ్యాసం చేయించడం జరిగిందన్నారు. క్లబ్ తరపున విద్యాభివృద్ధికి ఎల్లప్పుడు మద్దతుగా నిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 19:

### బీదర్ టూ హైదరాబాద్‌కు

## గంజాయి రవాణా

### నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

బండ్లగూడ, జూన్ 19: బీదర్ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్, అత్తాపూర్ ప్రాంతానికి చెందిన జగదీష్, రామ్ కుమార్, మనోజ్ చారి, నరేందర్‌ను స్థానికంగా ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్నారు. డబ్బులు సులువుగా సంపాదించడానికి ఈ నలుగురు కలిసి గంజాయి వ్యాపారం చేయాలనుకున్నారు. దీంతో వీరు ఓ కారులో కర్ణాటకలోని బీదర్‌లో మహేష్ రెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.40 వేలకు ఐదు కిలోల గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాదుకు తీసుకొస్తున్నారు. విశ్వసనీయ సమాచార మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా రాజేంద్రనగర్ పత్తి కుంట వద్ద గురువారం ఉదయం వాహనాలను తనిఖీలు చేశారు. ఈ క్రమంలో జగదీష్ , రామ్‌కుమార్, మనోజ్‌చారి, నరేందర్‌లు వస్తున్న వాహనాన్ని నిలిపి తనిఖీలు చేయగా ఐదు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ నలుగురిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 19: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాంతినగర్ అయ్యప్ప స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు పనులపై జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి కొత్త రోడ్లు వేయాలన్నారు. పను ల్లో నాణ్యత కొరవడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, డివిజన్ అధ్యక్షులు పాండుయాదవ్, నర్సిరెడ్డి, రమేష్‌రెడ్డి, కొడల్, తలారి చిన్న, నాగేష్, నందు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బడా వ్యాపారులపై ప్రతాపం ఏది..!


జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 19: కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనలో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆరోపించారు. గురువారం డివిజన్ పరిధిలో అక్రమాలు అంటూ జీహెచ్ఎంసీ అధికారులు షెడ్లు తొలగించేందుకు వచ్చిన పోలీసులు, అధికారులతో మాట్లాడి నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుపేదలు అప్పు చేసి ఏ పని లేక చిన్నా చితక వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటుంటే మున్సిపల్ అధికారులు తోడేళ్ల లాగా జేసీబీలు, భారీ పోలీసుల బందోబస్తుతో వారి వ్యాపారసముదాయాలను కూల్చివేయడం సరైన పద్ధతి కాదన్నారు. బడాబాబులు ఎంతో మంది రోడ్డు ఆక్రమణలు చేసి బహుళ అంతస్తు నిర్మాణాలు, వ్యాపారాలు చేసుకుంటుంటే వాళ్ల జోలికి వెళ్లరు కాని నిరుపేదలపై మాత్రం ఉక్కుపాదం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైఫిల్ హోటల్, ఇండియన్ బేకరీ, దుర్గానగర్, గణేష్‌నగర్ చౌరస్తా యూటర్న్ వద్ద స్థానిక ప్రజాప్రతినిధుల ఇండ్ల ముందు ప్రతి రోజూ రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు ఆపినప్పటికీ అధికారులకు, ట్రాఫిక్ సిబ్బందికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కొంత మంది కక్కుర్తి పడి సాయిబాబానగర్ నుంచి శివరాంపల్లి రైల్వే స్టేషన్ వరకు రెండు దిక్కుల రోడ్డును ఆక్రమించి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బడాబాబులకు ఒక న్యాయం, నిరుపేదలకు ఒక న్యాయం అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యూత్ అధ్యక్షులు అక్కెం రఘువేందర్‌యాదవ్, మైసిరెడ్డి, లక్ష్మీరాజ్, రాజు, శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 'యోగా' డే ఏర్పాట్ల పరిశీలన



యోగా డే సందర్భంగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తదితరులు

మణికొండ, జూన్ 19 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21న నిర్వహించే యోగా కార్యక్రమాలపై మణికొండ మున్సిపాలిటీ నాయకులు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. 21న యోగా డేను పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమంలోప్రతి ఒక్కరూ పాల్గొనాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మణికొండ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు నిరంజన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 21న ఉదయం 7 గంటలకు పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణ రెడ్డి, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు రవి కాంత్ రెడ్డి, నాయకులు బీరప్ప, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, మాజీ వార్డ్ మెంబర్ రాజేష్, నాయకులు శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొనారు.

## వ్యవసాయ కూలీ అదృశ్యం


శ్రీనివాస్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, జూన్ 19 : వ్యవసాయ కూలీ అదృశ్యమైన ఘటన గురువారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్కూడ గ్రామ పరిధిలోని అమ్మపల్లి దేవాలయం సమీపంలో అదే గ్రామానికి చెందిన లింగం రామారావు వ్యవసాయ పొలం వద్ద పని చేయడానికి కొందుర్గు మండలం చెక్కలోని గూడెం గ్రామానికి చెందిన శ్రీనివాస్(31) వచ్చి కొంతకాలం నుంచి పని చేస్తున్నాడు. ఈ నెల 17న ఉదయం 8 గంటల సమయంలో గేదెలు, ఆవులను మేత కోసం తీసుకుపోయిన అతడు సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో అతడి యజమాని లింగం రామారావు శ్రీనివాస్ సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో వెంటనే అక్కడికి వచ్చిన సోదరుడు ,యజమాని లింగం రామారావు కలిసి చుట్టు పక్కల ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### అత్యవసర సమయంలో తక్షణ వైద్యం

ఖైరతాబాద్, జూన్ 19 : రోడ్డు ప్రమాదాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు అత్యవసర చికిత్స ఎంతో అవసరం. రోగికి చికిత్స అనేది వైద్య సిబ్బంది స్పందనపై ఆదారపడి ఉంటుంది. అలాంటి క్రమంలో వైద్య వృత్తిలో ఉన్న వారు, ఆస్పత్రుల యాజామాన్యాలు స్పందించాల్సిన తీరును వివరిస్తూ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంజాగుట్ట జంక్షన్లో సకాలంలో చికిత్స, అత్యవసర సమన్వయ సేవ అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు.

### బోనాల నిధుల కోసం దరఖాస్తుల స్వీకరణ

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించే బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయాల నిర్వాహకుల నుంచి వేడుకల నిర్వహణ కోసం దరఖాస్తులు తీసుకుంటున్నా రు. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు కోసం గురువారం మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరు సునీత నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

## చిత్రపురిలో అక్రమాలపై విచారణ జరిపించాలి

### ఫిలించాంబర్ వద్ద సీఐటీయూ నేతలు, సినీకార్మికుల ధర్నా


ఫిలించాంబర్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, సినీ కార్మికులు

బంజారాహిల్స్,జూన్ 19: చిత్రపురి కాలనీ హౌజింగ్ సొసైటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. పేద కళాకారులు, సినీకార్మికుల కోసం దివంగత నటుడు, నిర్మాత ప్రభాకర్‌రెడ్డి కృషితో 67 ఎకరాల స్థలంలో చిత్రపురి కాలనీ ఏర్పాటు చేస్తే.. కొంతమంది సొసైటీ పెద్దలు ఆ స్థలంలో ఇష్టారాజ్యంగా ప్లాట్లు అమ్ముకుంటున్నారని వెంకటేష్ ఆరోపించారు. రోజువారీ కూలీతో పనిచేస్తున్న సినీ కార్మికులు రూ.3కోట్లు పెట్టి చిత్రపురిలో ప్లాట్ ఎలా కొంటున్నాడో విచారణ చేయాలన్నారు. చిత్రపురి పేరుతో రియల్ ఎస్టేట్ మాఫియాను నడిపిస్తున్నారని, సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌పై అనేక సివిల్, క్రిమినల్ కేసులున్నాయని అలాంటి వారి చేతిలో సినీ కార్మికులకు న్యాయం జరగడం అసాధ్యమన్నారు. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీలో ఏకంగా ఓ పోలీస్ అధికారికి ప్లాట్ ఉండటాన్ని చూస్తుంటే అక్రమాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో తెలుస్తోందన్నారు. హౌజింగ్ సొసైటీలో అక్రమాలను నిగ్గుతేల్చని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ సీఐటీయూ అధ్యక్షుడు కుమారస్వామి, నగర ఉపాధ్యక్షుడు మల్లేష్, జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ నేతలు.. రవీందర్, రమావేణి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భర్త ఇంటి ముందు భార్య న్యాయ పోరాటం

### ప్రేమించి పెండ్లి చేసుకొని ఇప్పుడు ముఖం చాటేశాడు

మణికొండ, జూన్ 19 : నీవు అంటే నాకు ఇష్టం...... నీవు లేకుండా బతకలేను.....నీవే నా సర్వస్వం అంటూ వెంటపడి ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ భర్త ఇప్పుడు నీవు నాకొద్దు మరో పెళ్లి చేసుకుంట అంటూ వేధిస్తున్న ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్షాకోర్టులో గురువారం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళితే....బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షాకోట్ సాయి బాలాజీ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 4లో తన భర్త శ్రీధర్ కుమార్ ఇంటి ముందు భార్య స్రవంతి ఆందోళనకు దిగింది. వివాహం జరిగి నాలుగు సంవత్సరాల తరువాత రెండో పెండ్లి కి సిద్ధమైన భర్త తీరుపై తన తల్లితో ప్లకార్డులు చేత పట్టుకొని బైఠాయించింది. ప్రేమ పేరు తో స్రవంతిని నమ్మించిన శ్రీధర్ ప్రేమ నిజమని నమ్మి తల్లిదండ్రులను ఎదురించి తాను వివాహం చేసుకుంటే ఇంత మోసం చేస్తావంటే మండిపడింది. భర్త శ్రీధర్ వ్యవహారంపై తనకు న్యాయం జరగాలని మరో పెళ్లి ఏవిధంగా చేసుకుంటాడో చూస్తానని హెచ్చరించింది. నాకు న్యాయం కావాలని సాఫ్ట్‌వేర్ భర్త ఇంటి ముందు మౌన పోరాటానికి సిద్ధపడ్డ ఆమెకు స్థానికుల నుంచి సంపూర్ణ మద్దతు సంఘీభావం తెలుపుతున్నట్లు తెలిపారు. తనకు న్యాయం జరిగేంత వరకు ఇక్కడి నుంచి కదిలేదని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న నార్సిం గ్ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపడుతున్నారు.

## ఓయూతో అమెరికా వర్సిటీ ఎంవోయూ


ఎంవోయూ చూపుతున్న ఇరు యూనివర్సిటీల అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ నోటర్ డామ్'తో ఉస్మానియా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో విద్యార్థుల సమగ్ర వికాసం, శిక్షణా రూపకల్పన, బోధనలో ఓయూ ఎడ్యుకేషన్ విభాగం, యూనివర్సిటీ ఆఫ్ నోటర్ డామ్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్‌చైల్డ్ సంస్థ ఇకపై కలిసి పనిచేయనున్నాయి. సర్వస్థాయి (whole school) దృక్పథం ద్వారా సామాజిక, భావోద్వేగ విద్య (Social and Emotional Learning–SEL) ను అందించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి సహా ఉమ్మడి పరిశోధనలకు తోడ్పడనుంది. ఈ మేరకు ఒప్పందంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ నోటర్ డామ్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్ మెంట్ ఆఫ్ ది హోల్ చైల్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నీల్ బూత్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్, కే మూర్తి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఎంవోయూ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్.కిషన్, డాక్టర్ లలిత, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

### పోలీసులతో దురుసు ప్రవర్తన

## ముగ్గురిపై కేసు నమోదు

హిమాయత్ నగర్ , జూన్ 19: విధి నిర్వహణలో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులపై నారాయణగూడ పీఎస్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం హయత్‌నగర్‌లో నివాసం ఉండే భాస్కర్, కిశోర్, బాలకృష్ణలు వన్ ప్లస్ సెల్‌ఫోన్ మదర్ బోర్డు సమస్య ఉందని రిపేర్ కోసం రెండు నెలల క్రితం హిమాయత్ నగర్ లోని వన్ ప్లస్ సర్వీస్ సెంటర్ లో ఇచ్చారు. రోజులు గడిచినా రిపేర్ కోసం ఇచ్చిన సెల్ ఫోన్ ఇవ్వకపోవడంతో భాస్కర్, కిశోర్, బాలకృష్ణలు సెంటర్ సిబ్బందితో గొడవకు దిగారు. దీంతో సెంటర్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గొడవ పడే వారిని సముదాయిస్తుండగా మేము ఫిర్యాదు చేయ లేదు.. మిమ్మల్ని ఎవరు పిలిచారని అంటూ కస్టమర్లు పోలీస్‌లపై దురుసుగా ప్రవర్తించారు. తమ విధులకు ఆటంకం కల్గించారంటూ పీఎస్‌లో పోలీసులు ఫిర్యాదు చేయగా, సెంటర్ వద్ద వీరంగం సృష్టించారంటూ సెంటర్ మేనేజర్ సర్ఫరాజ్ సైతం వారిపై ఫిర్యాదు చేశారు. రిపేర్ కు ఇచ్చిన సెల్ ఫోన్ ను ఇవ్వడంలో కాలయాపన చేయడంతో పాటు సెంటర్ సిబ్బంది బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. రెండు ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

### నిశ్చితార్థపు రింగ్ చోరీ

బంజారాహిల్స్,జూన్ 19: ఎంగేజ్‌మెంట్ రింగ్ చోరీ అయిందంటూ యువకుడు ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఫార్చ్యూన్ వన్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న పెల్లకూరు సాహిత్‌రెడ్డి అనే యువకుడికి ఇటీవల వివాహం జరిగింది. ఎంగేజ్‌మెంట్ సమయంలో పెట్టిన రింగ్‌ను రెండునెలల క్రితం ఇంట్లోని కప్ బోర్డులో పెట్టాడు. కాగా ఈనెల 3న భార్యతో కలిసి అమెరికాకు వెళ్లేందుకు ప్రయాణం అవుతున్న సమయంలో తన ఎంగేజ్‌మెంట్ రింగ్ కోసం చూడగా ఇంట్లో కనిపించలేదు. ప్రయాణం హడావుడిలో ఉన్న సాహిత్‌రెడ్డి పట్టించుకోలేదు. కాగా ఈనెల 16న అమెరికానుంచి తిరిగొచ్చిన సాహిత్‌రెడ్డి ఉంగరం కోసం చూడగా దొరకలేదు. సాహిత్‌రెడ్డి గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బన్సీలాల్‌పేట్: ముస్లిం శ్మశానవాటికలో తమ అభ్యర్థన మేరకు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయడానికి నిధులను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని బీఆర్ఎస్ మైనారిటీ సెల్ డివిజన్ అధ్యక్షుడు షేక్ జావేద్ అన్నారు. గురువారం రోడ్డు పనులు ప్రారంభం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

**IN THE COURT OF THE HON'BLE I SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**S.O.P.No. 46 OF 2025**

**Between:**
Shivani Shroff and others ...Petitioners
And
The Branch Manager, Standard Chartered Bank & Others.
All concerned ...Respondents

Please take notice that the Petitioners have filed the above Petition in SOP. No. 46 of 2025 against Respondents and all concerned seeking succession certificate on the file I senior Civil Judge, City Civil Court at Hyderabad in respect of the DMAT account, vide A/c. No. IN30036010603936 in the Standard Chartered Bank, Somajiguda Branch, which was operated by Late Sri Kirti Shroff @ Kirti Kumar Shroff, who is husband of the 1st petitioner and father of petitioner Nos. 2 and 3. The above petition stands posted to dt. 14.07.2025 for appearance of All concerned. If any person/s having any objection or interest over the said claim of the petitioners should appear before the Hon'ble court in the next date of hearing i.e., on 14.07.2025 at 10.30 AM either in person or through counsel, failing which the said petition will be decided in your absence as per law.

// BY ORDER OF THE COURT//
**M. JAYA KUMAR, Advocate**
Plot No. 1188, 3rd Floor, Road No. 45, Jubilee Hills, Hyderabad-500 033.